క్లుప్తంగా

సోషల్ డెమొక్రటిక్ జేఏసీ వైస్ చైర్మన్‌గా రవీందర్



హన్మకొండ : సోషల్ డెమొక్రటిక్ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బండారి రవీందర్‌ను నియమించినట్లు ఆ జేఏసీ చైర్మన్ కోల జనార్దన్, రాష్ట్ర చైర్మన్ ఎన్.చెన్న రాములు తెలిపారు. బీసీల అభివృద్ధికి, వారి సమస్యలపై పోరాడుతున్న హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన బండారి రవీందర్ సేవలు గుర్తించి ఈ పదవిలో నియమించినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

తిలక్ విగ్రహం చుట్టూ చెత్తను తొలగించాలి



తిలక్ విగ్రహం వద్ద బండ్లు, చెత్తాచెదారం

ఖిలా వరంగల్ : వరంగల్ కాశిబుగ్గ తిలక్ రోడ్డులోని లోకమాన్య బాలగంగాధర్ తిలక్ విగ్రహం చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని కాలనీ అధ్యక్షుడు లక్కిరెడ్డి పూర్ణేందర్‌రెడ్డి బల్దియా అధికారులను కోరారు. ఈనెల 23న తిలక్ జయంతి వేడుకలు జరగనున్న నేపథ్యంలో కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం సందర్శించి మాట్లాడారు. ఆయన వెంట కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చదనం కాపాడడానికి సామాజిక సేవ



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా : ప్రకృతిలో కనుమరుగవుతున్న పచ్చదనాన్ని కాపాడటానికి సామాజిక సేవలో భాగంగా ఏడేళ్ల నుంచి 400 మొక్కలు నాటడంతో పాటు, సొంత ఖర్చులతో పెన్సింగ్, నీరుపోస్తూ సంరక్షిస్తున్నట్లు ఓ సిటీ అసోసియేషన్ అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి అన్నా రు. వరంగల్ కాశిబుగ్గ ఓ సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌరిశెట్టి సంపత్, ప్రతినిధులు గడ్డం సతీష్ కుమార్, నర్సింహాచారి, కృష్ణమూర్తి, అశోక్, సంపత్, ఓ సిటీ రెసిడెంట్స్ సంఘం కార్యదర్శి దొంతుల శోభన్ పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయంలో పవిత్రోత్సవాలు

మడికొండ : మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరా స్వామి ఆలయంపై ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి సంవత్సర పర్యంతం జరుగు అర్చనాధి సమస్త కైంకర్య దోష ప్రాయశ్చిత్త నిమత్తం పవిత్రోత్సవాలు శ్రీవైఖానస శాస్త్ర విధానంగా తెలంగాణ వైఖానస ఆగమ సలహాదారు శ్రీవేదాంతం పవన్ కుమార్ వారి అర్చక బృందంచే రెండు రోజుల పాటు సోమవారం, మంగళవారం జరుపతలపెట్టిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామలయం కార్య నిర్వహణాధికారి ఎస్.సత్యనారాయణ, శివాలయం కార్యనిర్వహణాధికారి కే. శేషుభారతి, అర్చకులు పాల్గొన్నారు.

'నిందితులను ఉరితీయాలి'

హసన్‌పర్తి : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న హసన్‌పర్తికి చెందిన డాక్టర్ ప్రత్యూష మరణానికి కారకులైన నిందితులను ఉరితీయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రత్యూష సంస్మరణ సభ ఆదివారం రాత్రి స్థానిక కాకతీయ వెంటేజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో టీఎన్జీవోస్ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమన్న, వరంగల్ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాంకిషన్, కార్యదర్శి వేణుగోపాల్, భూపాలపల్లి ఉద్యోగ సంఘాలజేఏసీ చైర్మన్ రవి పాల్గొన్నారు.

గుడి అభివృద్ధికి కృషి

ఖిలా వరంగల్ : వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లోని తోట పోచమ్మ దేవాలయ అభివృద్ధికి మరింతగా కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి అన్నారు. సోమవారం కరీమాబాద్ పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో పూజారి కనుకుంట్ల భరత్, కన్వీనర్ వాసూరి శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా దూపకుంట రహదారి

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలంటున్న ప్రయాణికులు

న్యూశాయంపేట : వరంగల్ ఆర్టీఏ జంక్షన్ నుంచి చింతల్ వరకు జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల్లో భాగంగా వరంగల్ శంభునిపేట జంక్షన్ నుంచి దూపకుంటకు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డు కటింగ్‌తో రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో కాంట్రాక్టర్ రహదారిని కట్ చేసి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాడు. కానీ పనులు అర్ధంతరంగా వదిలి వేయడంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు రాత్రివేళల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న శంభునిపేట-దూపకుంట ప్రధాన రహదారి

కుల సర్వేతో ప్రయోజనం

- ఆరె కటిక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోగికార్ రవీందర్

ఖిలా వరంగల్ : కుల సర్వే చేయడం ద్వారా ఆరె కటికల అభివృద్ధికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆరె కటిక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గోగికార్ రవీందర్ తెలిపారు. సోమవారం నగరంలోని వరంగల్ జిల్లా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆరె కటిక కుల గణన సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆరె కటిక కుల సభ్యుల కుటుంబ సమాచారం సేకరణ చేయుటకు నిర్దేశించిన ప్రొఫార్మా నింపి అందజేయాలని కో రారు. కులగణనతో కుల సభ్యుల ఖచ్చితమైన సంఖ్య తెలిసి వారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలు, రుణాల మంజూరుకు కృషి చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివాజీ, కిషన్, సురేష్, సతీష్, శ్యాంబాబు, నాగరాజు, గణేష్, శ్రీనివాస్, రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోగికార్ రవీందర్

ప్రైవేట్ పాఠశాలల అభ్యున్నతికి కృషి

- హడుప్సా జిల్లా నూతన అధ్యక్షుడు బుచ్చిబాబు

విద్యారణ్యపురి : ప్రైవేట్ పాఠశాలల అభ్యున్నతికి కృషి చేస్తామని, టీచర్ల నైపుణ్యాల అభివృద్ధికి సెమినార్లు, వర్క్‌షాప్‌లు కూడా నిర్వహిస్తామని హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) జిల్లా నూతన అధ్యక్షుడు బుచ్చిబాబు అన్నారు. సోమవారం గోపాల్‌పురం విద్యాధరి హైస్కూల్‌లో నిర్వహించిన హడుప్సా సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా మాడగుల సంతోష్‌రెడ్డి, కోశాధికారిగా దామెరుప్పుల శంకర్, ఉపాధ్యక్షులుగా టి.రాజేశ్వర్‌రావు, కరుణాకర్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా జి.సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.వెంకటరెడ్డి, సహాయ కోశాధికారిగా నవీన్‌రెడ్డితో పాటు కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడు వర్ధమాన్ జనార్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బుచ్చిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించబోతున్నామన్నారు.10వ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్, మోటివేషన్ తరగతులను కూడా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో హడుప్సా సలహాదారులు పి వెంకటరమణ, ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, పి.వేణుమాధవరావు, వై వెంకటేశ్వర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిబాబు

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేశ్

కాజీపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి రథసారథులైన కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ నగర్ కాలనీలో సోమవారం గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల శివారులోని అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ సమావేశం ఏకగ్రీవ తీర్మాణాన్ని ఆమోదించింది. సమావేశంలో రియల్ పూర్ణచందర్, మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్ నాయక్, రవి, యాకయ్య, బంతిపూల రాజేశ్వరీ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను విజయవంతం చేయాలి

- యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు తిరుపతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు

విద్యారణ్యపురి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మూడు దశల్లో పోరాట కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని ఈ పోరాట కార్యక్రమాలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు నన్నబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో దశలవారి పోరాట కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు, తహసీల్దార్ల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. ఆగస్టు 1న జిల్లాకేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయుల మహాధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. మూడు దశల్లో జరిగే పోరాట కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లాల బాధ్యులు రావుల రమేష్, పెండెం రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, సత్యనారాయణ,,కె శ్రీనివాస్, గోవిందరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తాలో గుంతల పూడ్చివేత



గుంతలు పూడ్చివేయిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

కాజీపేట : కాజీపేట చౌరస్తాలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గుంతలతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన సీఐ వెంకన్న పర్యవేక్షణలో గుంతలను సోమవారం స్వయంగా ట్రాఫిక్ సిబ్బంది పూడ్చివేసి రహదారికి మరమ్మతు చేశారు. ట్రాఫిక్ పోలీసుల పనితీరును స్థానికులు అభినందించారు.

ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

విద్యారణ్యపురి : ఒడిస్సాలో వరుసగా అత్యాచారాలు జరుగుతున్నాయని అందులో ఎన్ఎస్‌యూఐ హస్తం కూడా ఉందని ఆరోపిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని సుబేదారి జంక్షన్‌లో ఎన్ఎస్‌యూఐ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ దూళిపూడి హరిచరణ్, వరంగల్ మహానగర కార్యదర్శి బెల్లం కార్తీక్, రాహుల్, నవీన్, త్రినేష్, వాసు, సలీం పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మడికొండ: గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ ఉనికిచర్లలో క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవత్‌రెడ్డి ఫ్లెక్సీకి సోమవారం మడికొండ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాగరాజు, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వస్కుల శంకర్, పైడిపాల రఘుచందర్, పల్లపు అర్జున్, బిల్లా రవీందర్, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, దువ్వ విజయ్, కుర్ల మోహన్,శ్రీను, వేణు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కళాకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

న్యూశాయంపేట : సమగ్ర సాంస్కృతిక విధానం ప్రకటించాలని, కళాకారులకు గుర్తింపు, హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి హనుమకొండ జిల్లా కార్యదర్శి కొట్టిపాక రవి డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కళాకారుల సమావేశం ఆర్.శ్యాం అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రవి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కళాకారులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు వి. భరత్, టి.మమత, స్వరూప, రమ, శిరిష, భూషణం, వెన్నెల, అనిలత, సునీల్ అనూష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కి కేక్ తినిపిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు

గ్రేటర్ పరిధిలోని అన్ని డివిజన్లలో, కేయూ క్యాంపస్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కొన్ని చోట్ల రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు అన్నదానం, చీరలు, అనాథ ఆశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు. మడికొండలో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సిరిసిల్ల రాజయ్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

హోటళ్ల వ్యర్థాలతో అనర్థాలు



కాజీపేట చౌరస్తాలో కాల్వల్లో పోసిన వ్యర్థాలు



కాల్వలో నిండిన వ్యర్థ పదార్థాలు

- వీధి కాల్వలు దుర్గంధం
- కాల్వల్లో పడేస్తున్న వేస్ట్ ఫుడ్
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న శానిటరీ అధికారులు

హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకుల నిర్లక్ష్యం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది. వ్యర్థాలను నేరుగా కాల్వలు, డ్రెయినేజీల్లో రాత్రి వేళల్లో పారబోస్తున్నారు. కాజీపేట చౌరస్తాలోని 62, 63వ డివి జన్‌ల పరిధిలో నెల కొన్న అపరిశుభ్ర వాతావరణం చూస్తే చాలు.. అధికారుల తీరు ఎలా ఉందో తేటతెల్లమవుతుంది.

కాజీపేట : చౌరస్తాలో పాతికకు మించి ఉన్న బిర్యాని విక్రయ కేంద్రాలు, హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు విడుదల చేస్తున్న వ్యర్థాలతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల మీద వదిలేసిన చెత్తాచెదారంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ఆ హోటళ్ల వెనుక వీధుల్లో నివాసం ఉంటున్న రోగాల బారిన పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలు కాలువల్లో పారేస్తుండటంతో వీధి కుక్కలు అటుగా నడిచే పాదచారులను భయానికి గురిచేస్తున్నాయి.

ముక్కు మూసుకోవాల్సిందే...

హోటళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు వ్యర్థాలు, మిగిలిపోయిన, పాడైన ఆహార పదార్థాలను డస్ట్‌బిన్లలో దాచి ఉంచి, రాత్రివేళల్లో కాల్వలు, చెట్ల మొదళ్లలో పారేస్తున్నారు. ఇవి మురుగు ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో పాటు, అక్కడే రోజుల తరబడి ఉండడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. రహదారి వెంట నడిచే వారు ముక్కు మూసుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా కాల్వలు ఊడ్చకపోవడంతో ఎక్కడికక్కడ పూడుకుపోయాయి. ప్రధాన రహదారుల్లోనూ, హోటళ్ల ముందు వంటలకు వినియోగించగా బాగా నల్లగా మారిన వ్యర్థ నూనెల్ని కాల్వల్లో పారబోస్తున్నారు. సంబంధిత అధికారులు చౌరస్తాలో పర్యటించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కాల్వలు దుర్గంధభరితం..



కాజీపేట చౌరస్తాలోని కాల్వలో వ్యర్థాలు నిత్యం పేరుకపోతున్నాయి. హోటళ్లు, క్యాటరింగ్ సెంటర్లలో మిగులు వ్యర్థాలతో దుర్గంధం వ్యాపించి కాలిబాటన నడవలేకపోతున్నాం. శానిటరీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదు.

– మండల సుబ్రహ్మణ్యం, కాజీపేట

అధికారులు స్పందించాలి



ప్రధాన రహదారుల వెంట ఉన్న కాల్వల్లో నిలిచిపోతున్న వ్యర్థాలు, చెత్తచెదారంపై ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పించాలి. అధి కారులు చౌరస్తాలో తరచూ పర్యటించి వ్యర్థాలను పారబోస్తున్న హోటళ్ల యజమానులను గుర్తించి జరిమానాలు విధించాలి.

– పిల్లల సుధాకర్, సోమిడి

వడ్డేపల్లి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్ : కాజీపేట వడ్డేపల్లి చెరువు రైల్వే బ్రిడ్జి వద్ద నీటిలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి కథనం ప్రకారం.. సుమారు 40 ఏళ్ల యవస్సు గల వ్యక్తి ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారి నీటిలో పడి, ఇతర కారణాలతో గానీ మృతి చెందినట్లుగా కనిపిస్తుందని తెలిపారు. మృతుడు బ్లాక్ కలర్ జీన్స్ పాయింట్, బ్లాక్ బెల్టు ధరించి, ఆకుపచ్చ రంగు ఆఫ్ బనియన్ ధరించి ఉన్నాడు. మృతిని కుడి చేతిపై హిందీలో రాధ అని పచ్చబొట్టు రాసి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తెలిసిన వారు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్, 8712658609, 9440027342 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్ఎంపై దాడి దుర్మార్గం

హన్మకొండ : ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్‌పై దాడి చేయడం దుర్మార్గమని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు గూడెల్లి దేవేందర్, కార్యదర్శి కొత్త నాగయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ లకావత్, జోనల్ ఉపాధ్యక్షుడు రమేష్ నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండలోని వరంగల్ రీజియన్ కమిటీ సమావేశంలో ఆర్ఎం డి.వి జయభానుపై జరిగిన దాడిపై చర్చించారు. కార్మికుల సమస్యలు వింటూ వాటిని పరిష్కరిస్తున్న ఆర్ఎంపై బయటి వ్యక్తులు వచ్చి దాడి చేయడం హేయమైన చర్య అని తెలిపారు.

కాపువాడలో గోరింటాకు వేడుకలు

హన్మకొండ చౌరస్తా : బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు నాసం కరుణ ఆధ్వర్యంలో 10వ డివిజన్‌లోని కాపువాడలో సోమవారం ఆషాఢమాస గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి , శ్రీ గౌరీదేవీల స్తోత్ర పారాయణం చేసిన మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం ఆటాపాటలతో గోరింటాకును అందమైన ఆకృతులలో ధరించారు. కార్యక్రమానికి బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రాగిడిలక్ష్మీరత్న పాల్గొని మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కేయూ సెనేట్ సభ్యురాలు కె అనితారెడ్డి, సిరికొండ సుజాత, పులి పుష్ప, జ్యోతి, ఉషారెడ్డి, రుద్రోజు భవాని, తదితరులు పాల్గొన్నారు.



చేతులకు గోరింటాకుతో మహిళలు

బేకరీలో చోరీ

కాజీపేట : 61వ డివిజన్ సిద్ధార్థనగర్ ప్రధాన రహదారిపై ఉన్న సెయింట్ మేరీస్ బేకరీలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దాదాపు రూ.20వేల నగదు, ఆహార పదార్థాలను అపహరించుకపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. యజమాని బిన్ని బేకరీ షాపునకు తాళం వేసుకుని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్లిపోయాడు. దాదాపు 3 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బేకరి షెట్టర్‌ను తెరిచి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లో ఉన్న నగదు, బేకరీ పదార్థాలను తీసుకుని వెళ్లిపోయారు. ఉదయం యజమాని షాపు షెట్టర్ తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుధాకర్‌రెడ్డితో పాటు క్రైం పార్టీ పోలీసులు క్లూస్ టీం సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ప్రారంభం

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో రూ. 50 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు సెంట్రల్ లైటింగ్ తోడ్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, కార్పొరేటర్ రాజు పాల్గొన్నారు.



సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి